క్లుప్తంగా

రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

జామి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆకాంక్ష చిల్డ్రన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.రవితేజ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 30 మంది యువకుల నుంచి ఎన్టీఆర్ ట్రస్ట్ సిబ్బంది రక్తం సేకరించారు. స్థానిక యువకులు కాకర దీపక్, చుక్క ప్రేమ్‌చంద్, జి.జోషెఫ్, ఆర్.దినేష్ సహాయ సహకారాలు అందించారు.

పారిశుద్ధ్య పనులు


కాలువలో పూడిక తీస్తున్న గ్రీన్‌అంబాసిడర్

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.చింతలవలస గ్రామంలో సర్పంచ్ కంది పద్మావతి ఆదివారం పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలో అన్ని వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను గ్రీన్ అంబాసిడర్ తొలగించారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. చెత్తను బహిరంగ ప్రదేశాలు, కాలువల్లో పారబోయకుండా ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబా సిడర్లకు అందించాలని, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులను సర్పంచ్ కోరారు.

పెన్షనర్ల సమావేశం


మాట్లాడుతున్న ఆలిండియా పెన్షనర్ల రాష్ట్రకమిటీ ప్రధాన కార్యదర్శి సుధాకర్

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఫేకర్ ఆఫీసర్స్ క్లబ్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఈపీఎఫ్ పెన్షనర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆలిండియా పెన్షనర్ల ఆంధ్రరాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.9 వేలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉచిత వైద్యం అందించాలని, ఆర్టీసీ బస్సు ప్రయాణ చార్జీల్లో 60శాతం రాయితీ కల్పించాలని కోరారు. జిల్లా ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు పి.వి.రమణ,ప్రధాన కార్యదర్శి ఎ.నాగభూషణం, చీపురుపల్లి సంఘం ప్రతినిధులు ఓ.ఎస్.ఎన్.మూర్తి, సీఐటీయూ గరివిడి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.గౌరినాయుడు, అధ్యక్షుడు జె.విశ్వనాథరాజు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణం


డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్న కార్మికులు

గజపతినగరం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో బ్రిడ్జి నుంచి స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వరకు డ్రైనేజీ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలతో పనులు చేసేలా ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాలువల నిర్మాణం పూర్తయ్యే వరకు స్థానికుల వాడుక నీరు, మురుగునీరు బయటకు పంపించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

'కళాతపస్వి'కి ఘననివాళులు


విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: స్థానిక గాయత్రి భవన్‌లో బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో కళాతపస్వి కె.విశ్వనాథ్ సంస్మరణ సభ ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సమాఖ్య సభ్యులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం విశ్వనాథ్ జీవితంలోని ముఖ్య సంఘటనలు గుర్తు చేసి, ఆయన సేవలను సమాఖ్య గౌరవాధ్యక్షుడు శ్రీకాంత్ కొనియాడారు. విశ్వనాథ్ చలనచిత్ర వైభవాన్ని అధ్యక్షుడు భోగరాజు బాబూజీ ప్రశంసించారు. మరో వక్త పీఎల్ సుబ్బారావు కవితాత్మకంగా ఆయనతో వారికి ఉన్న అనుబంధాన్ని తెలిపారు. కార్యక్రమంలో భరద్వాజ చక్రవర్తి, కామేశ్వరరావు, దామరాజు శంకరం, రమాదేవి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా..

● రూ.4.5 కోట్లతో బీటీ రోడ్డు పనులు

జామి: మండలంలోని భీమసింగి గ్రామం నుంచి అలమండ సంతవరకు రూ.4.5 కోట్ల వ్యయంతో తారురోడ్డు విస్తరణ,పునరుద్ధరణ పనులు జోరుగా సాగుతున్నాయి. 4.2 కిలోమీటర్ల రోడ్డుకు సంబంధించి సుమారు 80శాతం పనులు పూర్తయ్యాయి. గతంలో ఐదున్నర మీటర్ల వెడల్పు ఉన్న ఈ రోడ్డును ప్రస్తుతం 7 మీటర్ల వెడల్పు చేస్తున్నారు. విజయనగరం, అనకాపల్లి, కొత్తవలస,విశాఖపట్నం వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఇరుకురోడ్డు కావడం గోతులు తేలడంతో గతంలో ఈ మార్గంలో ప్రయాణం చేసే వారు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం రోడ్డు పునరుద్ధరణతో పాటు విస్తరణ చేయడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


అలమండ సంత- భీమసింగి మధ్య చేపట్టిన రోడ్డు విస్తరణ, పునరుద్ధరణ పనులు

హుషారుగా..


పోటీల్లో దౌడు తీస్తున్న ఎద్దులు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో రెండురోజులుగా నిర్వహించిన శ్రీ నందీశ్వరస్వామి తీర్థం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన హుషారుగా సాగింది. పోటీల్లో 13 జతల ఎద్దులు పాల్గొనగా..మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. స్వామి వారికి గ్రామస్తులు, చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు బోదల అప్పారావు, వరహాలబాబు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సారవంతంగా..

వేపాడ: ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటలు వేసే ముందు పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయడం వల్ల నేల సార వంతమవుతుందని ఏఓ సి.బి.యశ్వంతరావు తెలిపారు. మండలంలోని బానాది, ఎం.శింగవరం, వేపాడ, జగ్గయ్యపేట, శింగరాయి గ్రామాల్లో సుమారు 25 హెక్టార్లలో పచ్చిరొట్ట ఎరువుల్లో ఒకటైన కట్టె జనుమును రైతులు సాగు చేస్తున్నారని ఆయన చెప్పారు. ఏపుగా పెరిగి, పూత దశకు వచ్చిన కట్టె జనుమును భూమిలో కలియదున్నడం వల్ల నేలకు సూక్ష్మపోషకాలు, సేంద్రియ పదార్థం,నత్రజని సమృద్ధిగా అందుతాయని, సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని పంటదిగుబడి పెరుగుతుందని ఏఓ వివరించారు.


బానాదిలో సాగులో ఉన్న కట్టె జనుమ

బాల్యవివాహాలు అరికట్టాల్సిన బాధ్యత అందరిదీ


అవగాహన కల్పిస్తున్న ఎస్బీసీసీ జిల్లా సమన్వయ అధికారి రామకృష్ణ

బొండపల్లి: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ(ఎస్బీసీసీ)జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. మండలంలోని దేవుపల్లి గ్రామంలో కస్తుర్బా గాంధీ విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థినులకు పౌష్టికాహారం ఆవశ్యకత, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, లింగ వివక్షతపై ఆదివారం అవగాహన కల్పించారు. 18 ఏళ్ల నిండిన తర్వాతనే వివాహం చేసుకోవాలని బాలికలకు సూచించారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, రక్తహీనత సమస్య రాకుండా ఉండేందుకు కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. సామాజిక అసమానతలు తొలగించడానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. కేజీబీవీ ఎస్‌ఓ ఎం.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పుణ్యగిరిని సందర్శించిన అధికారులు


అధికారులతో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

● శివరాత్రి జాతరపై స్థానిక అధికారులకు సూచనలు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో విశిష్ట శైవక్షేత్రంగా వాసికెక్కిన పుణ్యగిరిలో శివరాత్రి సందర్భంగా రెండురోజులు నిర్వహించనున్న జాతర ఏర్పాట్లను ఆర్డీఓ సూర్యకళ, తమ రెవెన్యూ అధికారులతో, ఎస్‌డీపీఓ ఆర్.శ్రీనివాసరావు తమ పోలీస్ అధికారులతో కలిసి ఆదివారం పర్యవేక్షించారు. ఆర్డీఓ సూర్యకళ దారగంగమ్మలోయ, కోటిలింగాలరేవు, త్రినాథగుహ, పుట్టుదార ప్రాంతాలను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో ఏటా భక్తులకు ఎదురయ్యే ఇబ్బందులు, పరిస్థితులను తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఎస్‌డీపీఓ శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లపై ఎస్.కోట సీఐ సింహాద్రినాయుడు, ఎస్ఐ తారకేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌శాఖ పరంగా ఎక్కడా ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కేంద్రం నుంచి తగిన బలగాలు సాయం అందేలా చూస్తామని ఎస్‌డీపీఓ చెప్పారు.


స్నానఘట్టాలను పరిశీలిస్తున్న ఎస్‌డీపీఓ శ్రీనివాసరావు, పోలీసులు

16న మండల సర్వసభ్య సమావేశం

గుర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16వ తేదీన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్యాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల అధికారులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు , పీఏసీఎస్‌ల చైర్మన్‌లు హాజరుకావాలని కోరారు.

● కమ్మేసిన పొగమంచు


బొద్దాంలో ఉదయం 8:30 గంటల సమయంలో కురుస్తున్న మంచు

వేపాడ: మండలాన్ని పొగమంచు కమ్మేసింది. ఆదివారం ఉదయం 8:30 గంటల వరకు దట్టమైన పొగ మంచు కురవడంతో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. పగలు కూడా వాహనాల లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. మామిడి, జీడి పూతకు ఈ మంచుతో తీవ్రనష్టం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పాటూరులో 7.45 గంటల సమయంలో కురుస్తున్న మంచు

16వ తేదీన బంగారమ్మ తీర్థం

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామదేవత బంగారమ్మ తల్లి తీర్థం ఈ నెల16వ తేదీన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు గుర్రాల పరుగు పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. గుర్రాల పరుగు పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు

'స్నేహ' టాలెంట్‌టెస్ట్


టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక స్నేహ స్వచ్ఛంద సేవా సంస్థ నేతృత్వంలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. 50 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు స్నేహ వార్షికోత్సవం రోజున బహుమతులు ప్రధానం చేస్తామని టాలెంట్ టెస్ట్ నిర్వాహకుడు పి.శ్రీరాములు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రమైన రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి ఉత్సవాలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం లేకుండా దేవస్థానం అధికారులు చర్యలు చేపడుతున్నారు. కొత్తపేట, సీతారామునిపేట, గొర్లిపేట గ్రామాల్లో ఆదివారం విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు, వైర్లను తాకే చెట్ల కొమ్మలు, జంగిల్స్‌ను తొలగించారు. శివరాత్రికి భక్తుల రద్దీ దృష్ట్యా తోపులాటలు జరగకుండా ఇనుప బారికేడ్లను సిద్ధం చేస్తున్నారు. రామాలయంలో దర్శన, ప్రసాదాల కౌంటర్లతో పాటు ఉమా సదాశివాలయ ప్రాంగాణంలోను బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

పర్యవేక్షణ కమిటీలో మీడియా సభ్యులు

విజయనగరం అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మీడియాలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి, పర్యవేక్షణ నిమిత్తం జిల్లా స్థాయి మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీలో మీడియా తరఫున దూరదర్శన్ కరస్పాండెంట్ పీఎస్ఎస్‌వీ శివప్రసాద్, కేబుల్ నెట్‌వర్క్ తరఫున మైత్రి మీడియా బ్యూరో చీఫ్ జె.శేషగిరి సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, సభ్యులుగా జేసీ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.రమేష్ కొనసాగుతారు. ఎన్నికల దృష్ట్యా ప్రచార, ప్రసార మాధ్యమాల్లో ముఖ్యంగా అన్ని టీవీ చానళ్లు, దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆకాశవాణి, ఎఫ్ఎంలలో అభ్యర్థులు, పార్టీ నిర్వహించే ప్రచార కార్యక్రమాలపై కమిటీ సభ్యులు దృష్టి సారిస్తారు. ఎప్పటికప్పుడు ఖర్చులను పరిశీలిస్తారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

విజయనగరం: నగరంలోని సంతపేట గవరవీధి జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో ఉచిత యోగా శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభించారు. శ్రీగౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ తరగతులకు హాజరైన వారికి యోగా ఇంటర్నేషనల్ ట్రైనర్ జ్వాల వివిధ యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. సంఘ అధ్యక్షుడు కాంద్రేగుల శేఖర్ మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడి దూరమై, ప్రశాంతత చేకూరుతుందన్నారు. అందం, ఆరోగ్యం కూడా పెరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గంగాధర్, నాగభూషణరావు, కాశీ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

డీఈసీ, అల్బెండ్‌జోల్ మాత్రల పంపిణీ


బొండపల్లి: నెలివాడలో మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొండపల్లి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో గత రెండు రోజుల్లో 26 వేల మందికి ఫైలేరియా, నులిపురుగుల నివారణకు డీఈసీ, అల్బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశామని వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ తెలిపారు. నెలివాడ గ్రామంలో ప్రజలకు డీఈసీ, అల్బెండ్‌జోల్ మాత్రలను వైద్యసిబ్బంది ఆదివారం పంపిణీ చేశారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మాత్రలు అందించి, వాటిని వారితో మింగించారు. సీహెచ్‌ఓ రాజ్‌గోపాల్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


దత్తిరాజేరు: గడసాంలో డీఈసీ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

గడసాంలో..

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామంలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు ఫైలేరియా నివారణకు డీఈసీ మాత్రలను వైద్యసిబ్బంది ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నివాస పరిసరాల్లో చెత్త, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

ముమ్మరంగా అపరాల పంట తీతలు


పాతబగ్గాంలో పెసర పంటతీత పనులు చేస్తున్న మహిళలు

గజపతినగరం: మండలంలో ఖరీఫ్ వరి పంట కోతల సమయంలో అదే పొలాల్లో దుక్కులు చేయకుండానే రైతులు పెసర, మినప విత్తనాలు చల్లారు. ప్రస్తుతం ఈ పంటలు చేతికందడంతో తీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గజపతినగరంతో పాటు ఎం.వెంకటాపురం,ఎస్.జి.ఆర్.పురం, బంగారమ్మపేట, పాతబ గ్గాం, కొత్తబగ్గాం,భూదేవిపేట తదితర గ్రామాల్లో పెసర, మినప పంటలను రైతులు సాగుచేశారు. ఈఏడాది వాతావరణం అనుకూలించడంతో పాటు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించడంతో పంట దిగుబడి బాగా వచ్చిందని రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తామెప్పుడూ వైఎస్సార్‌సీపీతోనే..

మెరకముడిదాం: తాము ముందు నుంచి వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని, ఇకపైనా వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని మండలంలోని సాతాంవలస గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన సిర్లి సూర్యనారాయణ, రేగాన గురువులు, సామంతుల రామఅసిరియ్య, సిర్లిపైడియ్య తెలిపారు. ఆదివారం వారు సాతంవలసలో విలేకరులతో మాట్లాడుతూ తమ కాలనీలో సామాజిక భవన నిర్మాణానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నిధులు మంజూరు చేయించారని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు భవన నిర్మాణానికి తమ వంతు కూడా నిధులు ఇస్తామని నమ్మబలికి చీపురుపల్లి తీసుకువెళ్లి టీడీపీ కండువాలను బలవంతంగా వేశారని పేర్కొన్నారు. అయితే తాము ఎప్పటికీ వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని స్పష్టం చేస్తూ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుమత్సరామశివ, పెనుమత్స కృష్ణంరాజు, శంకరరావుకు తెలియజేశారు. దీంతో వారికి నాయకులు వైఎస్సార్‌సీపీ కండువాలను వేశారు.


వైఎస్సార్‌సీపీ నాయకులతో సాతాంవలస ఎస్సీ కాలనీ వాసులు

క్రీస్తు సందేశంతో ప్రపంచ శాంతి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పాస్టర్ రవికుమార్, తదితరులు

విజయనగరం టౌన్: ఏసుక్రీస్తు బోధనలు, సందేశం ప్రపంచ శాంతికి దోహదపడతాయని యేసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అంబటిసత్రం దగ్గరున్న చర్చి ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన స్థానిక గురజాడ కళాభారతి ఆవరణలో యూత్ ఫర్ జీసెస్ ఆధ్వర్యంలో ప్రియమైన నీకు విత్ లవ్ జీసెస్ అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నానని ప్రభువైన ఏసుక్రీస్తు అందరికీ చెప్పియున్నారని, ఆ ప్రేమను పొందేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతి, సామరస్యం కోరుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జాషువా టీమ్, సెరూయా టీమ్, జోసెఫ్ టీమ్, జీసస్ ట్రాంపెట్స్ పాల్గొంటాయన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించి, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, విక్టర్ బాబు, సీతారామయ్య, దేవరాజు, జాన్, నాగేశ్వరరావు, సుజాన్, యూత్ ఫర్ జీసెస్ టీమ్ హర్ష, నిశాంత్, ప్రశాంత్, డేవిడ్, మోడీ, లిక్కీ మోడీ అండ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.